మూతపడిన ప్రభుత్వ కార్యాలయాలు

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ప్రజలకు తప్పని అవస్థలు



మూతపడిన వెల్‌నెస్ కేంద్రం

కొత్తవలస: జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామగ్రామాన ఏర్పాటు చేసిన పలు కార్యాలయాలు కూటమి పాలనలో నిర్వీర్యం అవుతున్నాయి. వీటిని ఉద్దేశపూర్వకంగానే కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ ప్రజలకు ప్రభుత్వ సేవలను దూరం చేస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో గ్రామ గ్రామాన గ్రామ సచివాలయం, వెల్‌నెస్ కేంద్రం, రైతు సేవా కేంద్రం తదితర ప్రభుత్వ భవనాలను రూ.లక్షలతో వెచ్చించి ప్రభుత్వ సేవలను అన్ని వర్గాల ప్రజలకు చేరువ చేశారు. వీటిలో సచివాలయ ఉద్యోగులను నియమించి ప్రభుత్వ ప్రతి ఒక్క సేవను వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే చేరువ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇవన్నీ నిర్వీర్యం దశకు చేరుకున్నాయి. మండలంలోని నిమ్మలపాలెం గ్రామంలో మూతపడిన ప్రభుత్వ కార్యాలయాలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి రైతు సేవా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలను నిర్మించారు. ఇందులో సిబ్బందిని సైతం నియమించి మూడు నెలల కిందట ఎంతో అట్టహాసంగా ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి ఈ భవనంలో సిబ్బంది విధులను నిర్వహించడం లేద. కనీసం అటువైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదు. దీంతో వీటి ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలు దూరమయ్యాయి. భవనాలు నిరుపయోగంగా మారాయి. గ్రామస్తులకు, రైతులకు అరకొర సేవలే అందుతున్నాయని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూతబడిన భవనాలను తెరిపించి మెరుగైన సేవలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మూతపడిన రైతు సేవా కేంద్రం

అభివృద్ధిపై మాట్లాడే అర్హత 'కళా'కు లేదు..



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం మాట్లాడే అర్హత ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావుకు లేదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణలను విమర్శిస్తూ వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉత్తరాంధ్రలో ఎన్నో పదవులు చేపట్టిన కళా వెంకటరావు హయాంలో ఎలాంటి అభివృద్ధి జరిగిందో, ఆయన కంటే 20 సంవత్సరాలు తరువాత మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బొత్స హయాంలో ఎలాంటి అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పడిందన్నారు. టీడీపీ హయాంలో ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేస్తానని చెబుతుంటే దాన్ని అడ్డుకోవాల్సిన ఎమ్మెల్యే కళా వెంకటరావు విమర్శలకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంత్రి బొత్స హయాంలో జిల్లాలో జేఎన్‌టీయూ, ప్రభుత్వ మెడికల్ కళాశాల, వెటర్నరీ యూనివర్సిటీ, ప్రభుత్వ డిగ్రీ, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలతో బాటు తోటపల్లి ప్రధాన కాలువ కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. కళా వెంకటరావు హయాంలో ఏం చేసారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఆర్‌ఈసీఎస్‌ను పునరుద్ధరిస్తామని సాక్షాత్తూ చంద్రబాబు, లోకేష్‌లతో చెప్పించిన మీరు ఎందుకు ఆ పని చేయలేదని కళా వెంకటరావును ప్రశ్నించారు. చేతనైతే అభివృద్ధి చేసి చూపించాలి తప్ప విమర్శలు చేయడం కాదని స్పష్టం చేశారు. పీఎంసీ చైర్మన్ గవిడి సురేష్, పేరిపి సర్పంచ్ కోరాడ వృధ్వీ, కర్రోతు రమణ తదితరులు పాల్గొన్నారు.

గొర్రిపాటి ఆశయానికి గండి కొట్టొద్దు...



బొడ్డవరలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట: తాటిపూడి జలాశయ సాధనలో కీలక భూమిక పోషించిన దివంగత గొర్రిపాటి బుచ్చిఅప్పారావు ఆశయాలకు గండి కొట్టొద్దని రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు. జిందాల్ నిర్వాసితులు చేస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని మంగళవారం కొనసాగించారు. శిబిరంలో రైతు సంఘ నేత జగన్ మాట్లాడుతూ తాటిపూడి సాధనలో అవిరళ కృషి చేసిన గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును తాటిపూడి రిజర్వాయర్‌కు పెట్టటం, ఆయన విగ్రహావిష్కరణ చేయటం సంతోషమని, కానీ ఆయన ఆశయాలకు గండి కొట్టటం దుర్మార్గం అన్నారు. ఈ ప్రాంత రైతాంగం శ్రేయస్సు కోసం తాటిపూడి రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తే ఇప్పుడు రైతాంగం నోట్లో మట్టికొట్టి ఎంఎస్‌ఎంఈ పార్కులకు తాటిపూడి నీళ్లు అమ్మేసుకోవటం హేయమైన చర్య అన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు గొర్రిపాటి విగ్రహానికి పూలమాలలు వేసి ఫొటోలు దిగటం కాకుండా నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.

పూరిల్లు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న ఇల్లు

గంట్యాడ: మండలంలోని పెదమజ్జిపాలేం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన డోల గురునాధం ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఎవరు లేక పోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. బీరువా, ఫ్రిజ్, దుస్తులు, ఎలక్ట్రిక్ వస్తువులు కాలిపోయాయి. వీటి విలువ సుమారుగా రూ.2లక్షల పైన ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

విద్యుత్ షాక్‌కు గురై ఆవు మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవు

గుర్ల: మండలంలోని నడుపూరులో కె.పైడినాయుడుకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌కు గురు మంగళవారం మృతి చెందింది. గ్రామ శివారులో ఆవు మేస్తుండగా అదే ప్రదేశంలో తెగి పడి ఉన్న విద్యుత్ వైరు తగలడంతో మృతి చెందిందని పాడి రైతు పైడినాయుడు తెలిపారు.

చురుగ్గా ఈకేవైసీ

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా ఉన్న ఉపాధి వేతనదారులకు ఈకేవైసీ కార్యక్రమం చురుగ్గా జరుగుతుందని ఏపీవో కామేశ్వరరరావు అన్నారు. ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా సుమారు 20వేలకు పైగా వేతనదారులకు జాబ్ కార్డులు ఉన్నాయని, ముందుగా గ్రామాలలో అందుబాటులో ఉన్న వారందరికి ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఈకేవైసీ చేసిన తరువాత దూర ప్రాంతాలలో ఉన్న వారికి అవసరం ఉంటే చేయడం జరుగుతుందని తెలిపారు. పనులకు రాని వారిని తొలగించనున్నట్టు తెలిపారు.

వైభవంగా సీతారామ ఉత్సవ విగ్రహ ఆవిష్కరణ



ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తున్న భక్తులు

లక్కవరపుకోట : మండలంలోని రంగరాయపురం గ్రామంలో శ్రీ సీతారామ ఉత్సవ విగ్రహ ఆవిష్కరణ సహిత శ్రీ చితంబర స్వామి ఆలయ శిఖర యంత్ర పూర్ణ కళశ స్థాపన మహోత్సవ పూజలు రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం సీతారామలక్ష్మి స్వాముల వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. మండప ఆరాధనలు, విశేష హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాంప్రసాద్ దంపతులు, మాజీ జెడ్పీటీసీ కరడ్ల ఈశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

జడ్పీ చైర్మన్ నివాళి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలం కోనూరు గ్రామంలో వైస్ ఎంపీపీ రామకృష్ణరాజు చిన్నాన్న సాంబమూర్తిరాజు మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గ్రామానికి చేరుకుని ఆయన పార్థీవదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేగవంతంగా స్వమిత్వ సర్వే : డీపీవో



సమీక్ష నిర్వహిస్తున్న డీపీవో మల్లికార్జునరావు

చీపురుపల్లి: పంచాయతీల్లో నిర్వహిస్తున్న స్వమిత్వ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డివిజన్ పరిధిలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం, రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి ఆమదాలవలస మండలాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత సమయంలో స్వమిత్వ సర్వే పూర్తి చేయాల్సి ఉందన్నారు. మండలాల వారీగా సర్వే పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ కంఠాలు, నివాసాలు, ఖాళీ స్థలాలు సంబంధించి మూడు దశల్లో స్వమిత్వ సర్వే పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ అధికారుల సహకారం కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఐ.సురేష్, ఏవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలపై ఆరా...



మరుపల్లిలో మలేరియా కేసులు పరిశీలిస్తున్న ఏడీ డా.వరుణ్

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితో పాటూ క్షేత్ర స్థాయిలో అందుతున్న ఆరోగ్య సేవలను హెల్త్ ఎండ్ ఫ్యామిలీ అసిస్టెంట్ డైరెక్టర్ డా.వరుణ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి పరిధిలో నమోదైన మలేరియా, లెప్రసీ, టి.బి కేసులు వివరాలు, వారికి అందుతున్న చికిత్సలు, సేవలపై ఆరా తీశారు. అనంతరం మరుపల్లి గ్రామంలో 8 మందికి మలేరియా జ్వరాలు వచ్చినట్టు గుర్తించి వారిని కలిసి అందిన సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నుంచి పంపిన కేసులు వివరాలను ట్యాబ్‌లో క్రాస్ చెక్ చేసుకున్నారు. గత ఏడాది 320 మలేరియా కేసులు నమోదు కాగా ఈ ఏడాది 117 కేసులు నమోదైనట్టు గుర్తించారు. రెండు దఫాలు ఫాగ్ స్ప్రేయింగ్ చేసినట్టు, 11 వసతిగృహాల్లో స్ప్రేయింగ్ చేయించామని సిబ్బంది చెప్పారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారిణి వై.మణి, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్, హెచ్.ఎస్ వి.వి.రమణ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎం.ఎల్.హెచ్.పి భవాని తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన వసతులు

గంట్యాడ: రోగులకు మెరుగైన వసతులు కల్పించాలని కేంద్ర బృందం ప్రతినిధి వరుణ్ విజయగైకి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న మందులను, వైద్య పరీక్షలు చేసే ల్యాబ్‌ను పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఎల్‌వో డాక్టర్ రాణి, డీఎంవో వై.మణి, హెల్త్ ఎడ్యుకేటర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సందర్శన



ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న నేషనల్ హెల్త్ మిషన్ టీం

గజపతినగరం : గజపతినగరం మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని నేషనల్ హెల్త్ మిషన్ ఆర్‌వోహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వరుణ్ బృందం మంగళవారం పర్యటించింది. ఆసుపత్రిలోని వార్డులను, రోగులను, రోజువారి ఓపీని సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందులు విషయమై అడిగి తెలుసుకున్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం ఎప్పట్లో పూర్తవుతుందని ఆరా తీశారు. ఆసుపత్రి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆరోగ్యవంతమైన మహిళలతో శక్తివంతమైన కుటుంబాలు



గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై వివరిస్తున్న సూపర్‌వైజర్

కొత్తవలస : ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రమణమ్మ అన్నారు. మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. అనంతరం హెల్త్ సహాయకులు సత్యారావు మాత, శిశు మరణాలు జరగకూడదని, బాల్య వివాహాలు చేయరాదని, ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరగాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా అందిస్తున్న టేక్ హోమ్ రేషన్, గుడ్లు, పాలు, బాల సంజీవని, రైస్, పప్పు తదితర వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా సర్పంచ్ నంబారు మంగమ్మ ఆధ్వర్యంలో పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16న దివ్యాంగుల ఉచిత బస్సు పాసుల శిబిరం

జామి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ నెల 16న శ్రీవిజయదుర్గ సంక్షేమ సంఘం, ఎస్.కోట ఏపీఎస్‌ఆర్‌టీసీ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులు, రాయితీతో కూడిన బస్సు పాసులు మంజూరుకు శిబిరం నిర్వహించనున్నట్టు విజయదుర్గ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు ఉదయం 11 గంటలకు శిబిరానికి హాజరు కావాలని కోరారు. పాసులు జారీకి సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ధ్రువపత్రాలు ఒరిజనల్, జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. అంగవైకల్యం కనబడే విధంగా పాస్‌పోర్ట్ సైజు గల ఫొటోతో హాజరు కావాలని తెలిపారు. బస్సు పాసుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామంలో కోనేరు చుట్టూ అయ్యప్పస్వాములు, గ్రామపెద్దల సమక్షంలో కొబ్బరి మొక్కలు మంగళవారం నాటారు. గ్రామపెద్ద కె.రమణమూర్తితో పాటు అయ్యప్ప దీక్షాధారులు రాజు చెరువు గట్టుపై వీటిని నాటారు. పర్యావరణాన్ని రక్షించడంతో పాటు గ్రామానికి ఆదాయం వచ్చేందుకు ఈ మొక్కలు దోహదపడతాయన్నారు.

18న చెకుముకి పోటీలు



చెకుముకి సైన్స్ సంబరాలకు చెందిన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మెరకముడిదాం: పాఠశాల స్థాయిలో ఈ నెల 18న చెకుముకి పోటీలను నిర్వహించనున్నట్టు ఎంఈవోలు చంద్రశేఖర్, ధర్మశ్రీను తెలిపారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక సభ్యుల ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలకు చెందిన వాల్‌పోస్టర్‌ను జనవిజ్ఞాన వేదిక సభ్యులు ఎం.రఘునాధరాజు, మండల సింహాద్రిలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ఈ నెల 18వ పాఠశాల స్థాయి పోటీలకు తేదీన 8, 9, 10 వతరగతుల విద్యార్థులకు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎం.రమణ, ఎం.వెంకట చినఅప్పలనాయుడు, బి.నవీన్, పైడిరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన డీఈవో

దత్తిరాజేరు: కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఎస్ బూర్జవలస అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. డీఈవో మాణిక్యంనాయుడుతో కలిసి వెళ్లారు. ముందుగా పిల్లలతో మాట్లాడి సమయానికి ఆహారం అందుతుందా.. లేదా.. పాలు, గుడ్లు ఆకు కూరలు, కూరగాయాలు పెడుతున్నారా.. లేదా.. అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అన్నీ అందుతున్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతర వంటలను రుచి చూసి వంట గదిలో ఉన్న సరుకులను పరిశీలించారు. కేంద్రంలో పిల్లల సంఖ్యను పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్త భవానీకి సూచించారు.

గెడ్డ స్థలాల ఆక్రమణల పరిశీలన



గెడ్డను పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

శృంగవరపుకోట: పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న గెడ్డను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేయటంతో పాటూ, భవన వ్యర్థాలను గెడ్డలో వేయటం వల్ల గెడ్డ పూడుకుపోయి వరదనీరు కాలనీలోకి చేరి ముంపుకు గురవుతోందని స్థానిక న్యాయవాది, పర్యావరణవేత్త బి.రామకృష్ణ ఫిర్యాదు చేశారు. రామకృష్ణ ఫిర్యాదుతో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో అనూరాధ తదితర సిబ్బందితో వెళ్లి గెడ్డను పరిశీలించారు. గెడ్డ చదును చేసి ఆక్రమించిన వ్యక్తిని తక్షణం గెడ్డలో వేసిన మట్టి తొలగించాలని ఆదేశించారు. గెడ్డలో ఉన్న పూడికలను తీయించి గెడ్డను లోతు చేయించాలని ఈవో అనూరాధకు సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



జమ్ముపేటను సందర్శిస్తున్న డీపీవో మల్లికార్జునరావు

గుర్ల: గ్రామాలలో ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు డీపీవో బి.మల్లికార్జునరావు ఆదేశించారు. మండలంలోని జమ్ముపేటలో ఆయన మంగళవారం సందర్శించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సమకూరుతుందన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సురక్షితమైన నీరు సరఫరా చేయాలని సూచించారు. జమ్ముపేటను సందర్శించిన వారిలో పంచాయతీ కార్యదర్శి దివాకర్, సర్పంచ్ వరలక్ష్మి ఉన్నారు.

104 వాహనంలో పూర్తి స్థాయిలో మందులు ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న 104 ఇన్‌చార్జి జిల్లా మేనేజర్

గంట్యాడ: 104 వాహనంలో మందులు పూర్తి స్థాయిలో ఉండేటట్టు చూసుకోవాలని 104 ఇన్‌చార్జి జిల్లా మేనేజర్ కె.వి.నరసింహామూర్తి అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాన్ని ముందుగా తనిఖీ చేశారు. తర్వాత రికార్డులు పరిశీలించారు. మందులు ఇండెంట్ సకాలంలో పెట్టుకోవాలని తెలిపారు. సమయానికి వైద్య శిబిరం జరిగే గ్రామానికి చేరుకోవాలన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

బొండపల్లి: మండలంలోని బొడసింగిపేట గ్రామంలో మంగళవారం సర్పంచ్ మీసాల జానకీరాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖ పట్టణంలోని అనిల్‌నీరుకొండ ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయగా గ్రామానికి చెందిన రోగులే కాకుండా పరిసర గ్రామాలకు చెందిన రోగులు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చారు. సుమారు 200 మంది రోగులను పరిక్షించి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు ఉమామహేశ్వరావు, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.